

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి):అర్హులైన ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, డిసేబుల్ వెల్ఫేర్, మైనార్టీ విద్యార్థుల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలు, బోధన ఫీజుల కోసం సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. ఈ-పాస్ పోర్టల్‌లో సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99486 63053 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి కాంగ్రెస్ పాదయాత్ర

హాజరుకానున్న మీనాక్షీ నటరాజన్, మహేశ్ గౌడ్

ఏర్పాట్లు పర్యవేక్షించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు

వికారాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పరిగి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపటనున్న జనహిత పాదయాత్ర గురువారం పరిగి నుంచి శ్రీకారం చుట్టేందుకు పార్టీ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మీనాక్షీ నటరాజన్, ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని పరిగి నియోజకవర్గం నుంచి ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే ముఖ్య నేతలకు పరిగి మండలం, రంగాపూర్ వద్ద ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సాయంత్రం 5 గంటలకు రంగాపూర్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర పరిగి పట్టణంలో బాహర్‌పేట్ మీదుగా గాంధీ చౌక్ వరకు

మిగతా 8వ పేజీలో...

రంగాపూర్ నుంచి ప్రారంభం



శ్రమదానం నిర్వహించే గిరిజన రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

నాణ్యమైన భోజనం అందించాలి

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

కీసర రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. బుధవారం కీసర టౌన్‌లోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో కొనసాగుతున్న జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గదిని, హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. స్వయంగా భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల చేత బ్లాక్ బోర్డుపై లెక్కలు చేయించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో గత సంవత్సరం కంటే ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాలల కన్వీనర్ రజినీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కీసర టౌన్‌లోని ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేసారు. సూచిక బోర్డులో సూచించిన విధంగా ఎరువుల నిల్వలు ఉన్నాయా లేదా అని రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, నకిలీ మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించకుండా తరచూ తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఏవో చంద్రకళ, కీసర మండల వ్యవసాయాధికారి మధవి పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్లకు ఆగస్టు 13 చివరి తేదీ

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఆగస్టు 13 చివరి తేదీ అని కో - ఆర్డినేటర్ నాగేశ్వర్‌చారి తెలిపారు. ఇందులో చేరడానికి ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఒకేషనల్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన వారు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు పీపుల్స్ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఉండేందుకు చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ జిల్లాలో ఇంకా కొలిక్కి రాలేదు. కొన్ని స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా.. మరికొన్ని పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక బోధన సజావుగా కొనసాగడం లేదని గుర్తించిన ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. సర్దుబాటు చేయాలని ప్రతిపాదించిన ఉపాధ్యాయుల్లో ఎస్జీటీలు 55 మంది ఉండగా, స్కూల్ అసిస్టెంట్లు 48 మంది ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో మొత్తం 1,066 పాఠశాలలు

కొలిక్కి వచ్చేనా?

ముందుకు సాగని ఉపాధ్యాయుల సర్దుబాటు


ప్రక్రియ సాగదీతపై ఆందోళన

సుమారు వంద మందికి స్థానచలనం

ఎస్జీటీలు 55, స్కూల్ అసిస్టెంట్లు 48 మంది

ప్రత్యేక కేటగిరి ఉపాధ్యాయులకు మినహాయింపు

అవసరమైన స్కూళ్లకు కేటాయింపులు జరిగేనా?



వికారాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మండల విద్యాశాఖ అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని ఈనెల 17వ తేదీలోగా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యా శాఖ ఆదేశించిన ఇంత వరకు ఈ విషయమై తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టమవుతోంది. మండలాల నుంచి డీఈవో కార్యాలయానికి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అధికారులు ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కాగా, సర్దుబాటును కొందరు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుండగా,

మిగతా 8వ పేజీలో...

మొదట ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలకు ముందుగానే గతేడాది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే.. అప్పట్లో జూన్ 16వ తేదీలోగా ఈ ప్రక్రియ చేపట్టాలని మొదట నిర్ణయించిన

సంఘాల వత్తిళ్లతోనే..

ఉన్నతాధికారులు ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన ఒత్తిళ్లతో జూలై 17వ తేదీ వరకు సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ నిబంధనల ప్రకారం ఏ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు.. ఏ పాఠశాలలో తక్కువగా ఉన్నారనేది స్పష్టత వచ్చిన తర్వాత కూడా విద్యాశాఖ అధికారులు సర్దుబాటు ప్రక్రియ సాగదీయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆ టీచర్లకు మినహాయింపు..

జిల్లాలో మొత్తం 1,066 ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా, ప్రస్తుతం జిల్లాలో వివిధ ఉపాధ్యాయ పోస్టులు 467 ఖాళీగా ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు ప్రవేశాలు చివరి దశకు చేరుకున్నాయి. ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడంలో మొదట గ్రామ పంచాయతీ పరిధిలో, తర్వాత స్కూల్ కాంప్లెక్స్ ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో చేయాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా సర్దుబాటు చేయాలి. ఇదిలా ఉంటే, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులతో పాటు ప్రత్యేక కేటగిరి ఉపాధ్యాయులకు సర్దుబాటు నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తోంది.



ఘట్‌కేసర్‌లో మోస్తరు వర్షం



చందుపట్లగూడలో కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్, జూలై30 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల మూడు రోజుల పాటు ఏకధాటిగా వర్షం కురిసిన విషయం తెలిసిందే. అనంతరం నాలుగు రోజులుగా వాతావరణం పొడిగా మారింది. నిత్యం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం తర్వాత విచ్ఛిన్నం కావడం జరిగింది. కాగా, బుధవారం మధ్యాహ్నం తర్వాత ఆకాశం నల్లటి మేఘాలతో నిండిపోయి రెండు దఫాలుగా మోస్తరు వర్షం కురిసింది.

నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ప్రయాణ వసతుల కల్పించడానికి నేరుగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకోవడాని నేడు(గురువారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ నంబర్ 9959226152లో తెలియజేస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని డీఎం తెలిపారు.

వ్యాధుల కాలం..
అప్రమత్తత ముఖ్యం
రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తప్పనిసరి
లక్షణాలుంటే వెంటనే వైద్యం చేయించుకోవాలి 7

బాలిక కిడ్నాప్
పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
నాలుగు రోజులైనా పట్టించుకోని పోలీసులు 7

పక్కాగా విద్యార్థుల హాజరు

ఇక నుంచి ముఖ గుర్తింపుతో నమోదు

ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలు

విద్యార్థుల హాజరు శాతం పెంపునకు కృషి

మేడ్చల్ జిల్లాలో 505 పాఠశాలలు

మొత్తం విద్యార్థుల సంఖ్య 90 వేలు

మేడ్చల్, జూలై 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం నమోదును పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థుల హాజరులో అవకతవకలు లేకుండా పారదర్శకంగా ఉండేందుకు విద్యాశాఖ ముఖ గుర్తింపు ఆధారంగా హాజరు నమోదు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ప్రతీ రోజు ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ విధానం ద్వారానే విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు సైతం పంపిణీ చేస్తున్నప్పటికీ అన్ని పాఠశాలల్లో వంద శాతం ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ సాగడం లేదు. దీంతో ఇటీవల జిల్లా విద్యాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం హాజరు నమోదుకు శ్రీకారం చుట్టారు. కొన్ని పాఠశాలల్లో నామమాత్రంగా ఈ విధానం పాటిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెద్దగా నమోదు కావడం లేదు.

నేరుగా డీఈవోకు స్కూళ్ల వారీగా..

ఇటీవల ఉన్నత విద్యాధికారులు నిర్వహించిన సమీక్ష సమావేశంలో దీనిపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కచ్చితంగా అమలు చేయాలనే ఆదేశాలు జారీ చేశారు. వంద శాతం

మిగతా 8వ పేజీలో...



విద్యార్థుల ముఖ గుర్తింపుతో హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

వారంలో మెడికల్ కాలేజీని సిద్ధం చేయండి

రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి

వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా



ఆస్పత్రిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దని, వైద్యులు సమయ పాలన పాటించాలని వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసే కొడంగల్ మెడికల్ కాలేజీ, మహిళా శిశు ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రులను కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఎంఈ డాక్టర్ నరేంద్రలతో కలిసి ఆమె పరిశీలించారు. సీసీ రోడ్డు, కంపౌండ్ వాల్, సీసీ టీవీలు, సెక్యూరిటీ రూమ్, మంచి నీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం వంటి పనులన్నింటినీ వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై రోగులతో మాట్లాడారు. ప్రతీ వార్డును శుభ్రంగా ఉండేలా చూడాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మాతా శిశు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి గర్భిణులకు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జీజీహెచ్ డాక్టర్ మాలతీ, ఆర్ఎంఓ డాక్టర్ ఆనంద్ గోపాల్‌రెడ్డి, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ, తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ఆపేదెవరు!



పై చిత్రం చూశారా! మమ్మల్ని ఎవరు ఆపేది అన్నట్టుగా నలుగురు మహిళలు ఒక స్కూటీపై వెళ్తున్నారు. తాండూరు పట్టణం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో స్కూటీపై నలుగురు మహిళలు వెళ్తూ బుధవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కారు.

-బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి)

నిబంధనలు పాటించకపోతే సీజ్

మేడ్చల్ డీఎంహెచ్‌వో ఉమాగౌరి.. విస్తృతంగా ఫర్టిలిటీ సెంటర్ల తనిఖీలు



ఫర్టిలిటీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

మేడ్చల్, జూలై 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిబంధనలకు విరుద్ధంగా ఫర్టిలిటీ సెంటర్లను నిర్వహిస్తే సీజ్ చేస్తామని డీఎంహెచ్‌వో ఉమాగౌరి హెచ్చరించారు. సరోగసి ముసుగులో ఇటీవల నగరంలోని ఓ ఫర్టిలిటీ కేంద్రంలో వెలుగు చూసిన ఘటనతో వైద్యారోగ్య శాఖ అధికారులు జిల్లాలోని సంతాన సాఫల్య కేంద్రాల్లో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ ఆదేశాల మేరకు కూకట్‌పల్లిలోని అవని, ఐశ్వర్య, ఫర్టీ9 ఫర్టిలిటీ కేంద్రాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఆయా సెంటర్లలో రికార్డులను పరిశీలించి స్కానింగ్ రిపోర్టులు, ఐయూఐ, ఐవీఎఫ్, సరోగసి ప్రొసీజర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న కేంద్రాలను సీజ్ చేయాలని, ఒకవేళ అనుమతితో ఉంటే సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించాలనే ఆదేశాలతో ఫర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఈ సందర్భంగా డీఎంహెచ్ తెలిపారు.

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత, రైతులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ద్వారా ఆదాయ వనరులను పెంచుకోవాలని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సి.సుధాకర్ అన్నారు. బుధవారం పరిశోధన కేంద్రంలో జిల్లా స్థాయి ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, రైతులకు అగ్రి హబ్ తాండూరు లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్, ఏఎస్‌పీఐఆర్ఈఈ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. రైతులను వ్యాపారవేత్తలుగాచేసే కార్యక్రమం, వ్యవసాయ రంగంలో వ్యాపారావకాశాలకు తోడ్పాటుపై శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలకు న్యాయకత్వం వహిస్తున్న డైరెక్టర్లు, వ్యాపారాభివృద్ధి, మార్కెట్ లింకేజీలు, సమర్థ వ్యవస్థాపనలపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రవేత్త సూచించారు. వ్యవసాయోత్పత్తులతో వ్యాపారాలను ప్రారంభించేందుకు సదుపాయాల కల్పన, శిక్షణ, మద్దతు విధానాలపై చర్చించారు. మార్కెటింగ్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లు నెలకొల్పుకోవాలని సూచించారు. టీఆర్‌వీకే కోఆర్డినేటర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి సమస్యలపై తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయంలో వ్యాపారావకాశాలు, డిజిటల్ మార్కెటింగ్ సిస్టంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్‌పీఓలు మోడళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సి.సుధారాణి, శాస్త్రవేత్తలు యమున, భారతి, స్వాతి పాల్గొన్నారు.

అగ్రి పరిశ్రమలతో ఆదాయం పెంచుకోవాలి



రైతులు, ఎఫ్‌పీఓ డైరెక్టర్లకు శిక్షణనిస్తున్న శాస్త్రవేత్త సుధాకర్


ప్రదర్శించిన మోడళ్లపై వివరిస్తున్న శాస్త్రవేత్తలు

భట్టి సభ సక్సెస్.. కాంగ్రెస్‌లో జోష్


నేతలను గజమాలతో సత్కరించిన కాంగ్రెస్ శ్రేణులు(ఫైల్)

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల పర్యటన, సభల సక్సెస్‌తో తాండూరు కాంగ్రెస్ జోష్ నెలకొంది. త్వరలో స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కార్యక్రమాల నిర్వహణ, సభకు మహిళలు, యువత తరలిరావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. తాండూరులో ఒక మంచి నాయకుడిని ఎమ్మెల్యేగా ఎనుకున్నారని, మనోహర్‌రెడ్డి ఆరాటం, పోరాటం అంతా తాండూరు నియోజకవర్గం కోసమేనని, ప్రభుత్వం నుంచి భారీగా నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని అనడం కాంగ్రెస్ నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ ప్రాంత సమస్యలను, స్టోన్‌పాలిషింగ్‌కు సమస్యలపై పరిష్కరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడంతో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని తేల్చి చెప్పినట్టయింది. తాండూరు మున్సిపాలిటీలో రూ.7.37కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర వర్క్‌ల శంకుస్థాపనలతో ప్రజల్లో అనుకూలత వ్యక్తం అవుతోంది. తాండూరు ప్రాంతంలో కాగ్నానది ఆధానంగా ఎత్తిపోతల పథకాన్ని, నవాంద్గి(బషీరాబాద్)కి 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు, 50ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు డిప్యూటీ సీఎం ఒప్పుకోవడం కాంగ్రెస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.

ఆ భూముల్లో జోక్యం చేసుకోవద్దు

● కమిషనర్‌కు హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తాండూరులోని సాయిపూర్‌లోని సర్వే నంబర్లు 954, 96/యూయూ, 97/లు, 106/ఎల్‌యూ, 107/ఆర్‌యూ ప్లాట్లలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని హైకోర్టు న్యాయమూర్తి బి.విజయషేన్‌రెడ్డి తాండూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. తదుపరి విచారణ వరకు ఈ భూముల్లో జోక్యం చేసుకోవద్దని, మొత్తం ఎకర ఏడు గుంటల స్థలం ఉందని ఆర్డర్‌లో పేర్కొన్నారు. కోర్టు ఆర్డర్‌ను మున్సిపల్ కార్యాలయంలో అందజేశామని పిటిషనర్ ఎస్.విజయదేవి, వి.రంగారావు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తమ ప్లాట్లలో జోక్యం చేసుకుంటున్నారని వారన్నారు. తదుపరి ఉత్తర్వులొచ్చేదాక కమిషనర్, అధికారులు ఎవరూ ఈ స్థలంలోకి రావొద్దని కోర్టు ఆర్డర్‌లో పేర్కొంటూ ఇంటరిమ్ డైరెక్షన్ ఇచ్చారని వారు తెలిపారు. ఈ స్థలాలు ఎస్.విజయదేవి, రంగారావు, స్రుజన్‌ల పేరిట ఉన్నాయని చెప్పారు. ఇదిలా ఉంటే గతంలోనూ ఈ స్థలాల విషయంలో పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో గల విక్టోరియా కళాశాలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలని, అప్పుడే ఎంచుకున్న లక్ష్యాలను చేరుతారని తెలిపారు. పట్టుదలతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. మెల్బోర్న్‌లోని విక్టోరియా కళాశాలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం అభినందనీయమని తెలిపారు. ఇరు కళాశాలలు విద్యార్థులు భవిష్యత్తుకు ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో విక్టోరియా కళాశాల సీఈవో సూరపనేని అర్జున్, కేపీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, డీన్ శ్రీవాస్తవ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మహా గర్జన'ను విజయవంతం చేయాలి

పెద్దేముల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, పింఛన్‌దారుల మహాగర్జన సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి స్వామిదాస్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం జనగాం, మారెపల్లి గ్రామాల్లో దివ్యాంగులు, ఆసరా పింఛన్‌దారులతో సమావేశమయ్యారు. పింఛన్లు రూ.4వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 2న కొడంగల్‌లో నిర్వహించే మహాగర్జన సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు.

విధుల పట్ల అలసత్వం వహించొద్దు



సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

కొడంగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహించకుండా అంకితభావంతో పనిచేయాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ.సత్యనారాయణతో పెండింగ్ కేసులపై తెలుసుకున్నారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతాచర్యలపై సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

దుద్యాల: దుద్యాల పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని డీఎస్పీ సూచించారు. దుద్యాలలో చేపడుతున్న పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీతో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై యాదగిరి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నవాంద్గీ-హల్కోడ రోడ్డుకు మహర్దశ

● రూ.కోటి నిధులతో పనులు షురూ


రోడ్డు పనులను పరిశీలిస్తున్న అజయ్‌ప్రసాద్, తదితరులు

బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య లింకు రోడ్డుకు మహర్దశ వచ్చింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.కోటి మంజురయ్యాయి. నవాంద్గీ-కర్ణాటక లోని హల్కోడ గ్రామాల మధ్య 1.5కిలోమీటర్ల రోడ్డు పనులు జోరందుకున్నాయి. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులను ముమ్మరం చేశారు. మొరం పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాను సారం నవాంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ బుధవారం ఈ పనులను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు ఆర్ఎంపీ వైద్యులు నర్సింహ, నాయకులు రియాజ్ తదితరులున్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి


ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న కాశీరావు

శంకర్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఏపీఎస్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి, మహాలింగపురం, పర్వేద, రావులపల్లి ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును నిర్వమించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

చౌదరిగూడ, జూలై 30(ఆంధజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లలో వనంపల్లి శ్రీనివాస్‌కు మంజూరైన ఇంటి స్లాబ్ పనులను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు పరిశీలించారు. పనులను దగ్గరుంచి చేయించారు. మండలానికి మంజూరై 506 ఇండ్లలో 392 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 163 బేస్మెంట్ పనులు, పది ఇళ్ల గోడల వరకు నిర్మాణం అయ్యాయని ఎంపీడీవో తెలిపారు. కొందుర్గు మండలంలో 495 ఇండ్లకు 264 ఇళ్ల బేస్మెంట్ పనులు కొనసాగుతున్నాయని ఎంపీవో విజయ్‌కుమార్‌పాల్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌నర్సింహారెడ్డి, లింగంగౌడ్, శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.


ఇంటి స్లాబ్ నిర్మాణానికి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

చేవెళ్ల, జూలై30(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం ముడిమ్యాల్ గ్రామ జేఏపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50మంది నాయకులు చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సబితారెడ్డి నివాసానికి చేరుకొని ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు, కార్యకర్తలకు సబితారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వారితో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. నాయకులకు, కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, చేవెళ్ల మండల యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శశిపాల్, శేరి రాజు, మాధవరెడ్డి, ఆరిఫ్ మియా, రాములు, రమేశ్, మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, అంజయ్య, రమేశ్, జైపాల్, నర్సింలు, మహేందర్, బద్రి పాల్గొన్నారు.


మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు



పసుపు పంటను పరిశీలిస్తున్న అధికారులు

క్షేత్రాల్లో పంటల పరిశీలన

కొడంగల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): టేకుల్‌కోడ్ గ్రామంలో రైతు గోవర్ధన్ సాగు చేసిన పసుపు, ఆయిల్‌పామ్ పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారి తులసి, వ్యవసాయ విస్తరణాధికారి దేవేందర్ పరిశీలించారు. రైతుకు పలు సూచనలు చేశారు. పసుపు పంటలో ఆకుమచ్చ తెగులు నివారణకు వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు.

బాలిక కిడ్నాప్

కూతురిని వెతికి అప్పగించాలని పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

» నాలుగు రోజులైనా పట్టించుకోని పోలీసులు

బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లోంచి తమ కూతురిని ఎవరో కిడ్నాప్ చేశారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులుగా కూతురి ఆచూకీ లభించక తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద బాలిక తల్లిదండ్రులు విలేకరుల వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతుల కూతురు(15) ఏడో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 23న ఇంట్లో నుంచి బాలిక కన్పించకుండా పోయింది. బయటి నుంచి ఇంటికొచ్చిన తల్లిదండ్రులకు కూతురు కన్పించలేదు. రెండు రోజుల పాటు తెలిసిన చోటల్లా వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాక 26న బషీరాబాద్ పోలీసులకు కూతురి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు, కూతురి ఫొటోలు బాలిక తండ్రి ఇన్‌స్టగ్రామ్, వాట్సా‌ప్‌లలో కప్పించాయి. దీంతో ఆ యువకుడే బాలికను కిడ్నాప్ చేసి ఉంటాడని గుర్తించారు. అతడిది ఏ ఊరో తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులైనా పోలీసులు తమ కూతురి ఆచూకీ కనుక్కోకపోవడంతో మరోసారి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తమ కూతురిని తమకు అప్పగించాలని ఎస్‌ఐతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉంటే అయితే సదరు యువకుడి కుటుంబీకులు బాలిక తండ్రికి ఫోన్ మాట్లాడుతూ.. 'మీరు కేసు పెడితే ఏం అవుతుంది. తాండూరుకొస్తే మట్లాడుకుందాం.' అని ఫోన్‌లో వాదనకు దిగారు. మైనర్ అయిన తన కూతురిని కిడ్నాప్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ నుమాన్ అలీ స్పందన కోరగా.. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పరిగిలో ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం

» కోచ్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలనుసారం ఖేలో ఇండియా, ఖోఖో శిక్షణ శిబిరం పరిగి కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎంఏ సత్తార్ పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని నిర్వహించేందుకు పూర్తి స్థాయి కోచ్ అవసరం ఉందన్నారు. జాతీయ స్పోర్ట్స్ ఫెడరేషన్ వారి ద్వారా లేదా గుర్తింపు పొందిన సంస్థలు నిర్వహించిన జాతీయ స్థాయిలో సీనియర్ నేషనల్/ఖేల్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారు, జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా యూనివర్శిటీ పోటీలలో పతకాలు సాధించిన వారు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న వారు ఈ కోచ్ పదవికి అర్హులన్నారు. అర్హులైన వారు ఆధార్ కార్డు ఫొటోకుల ధ్రువపత్రాలు స్పోర్ట్స్ పత్రాలు జత చేసి.. నేషనల్ స్పోర్ట్స్ రిజిష్టర్ నంబర్లతో జిల్లా యువజన క్రీడల అధికారికి ఆగస్టు 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9848395708, 9676638201 నంబర్లలో సంప్రదించాలన్నారు.



ప్రొసీడింగ్‌లను అందిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

కులకచర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపునిస్తాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలో ఇళ్ల లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి ప్రొసీడింగ్‌లను అందించారు. ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనంద్, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎల్లప్ప, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలి

» మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా పీహెచ్‌సీ సెంటర్లకు కేటాయించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మల్కాజిగిరి ప్రజలతో కలెక్టరు మను చౌదరిని కలిసి పలు సమస్యలపై కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకర్గంలో ఎక్కడచూసినా భూముల కబ్జాలే జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో డంప్ యార్డులు, శ్మశానవాటికల సమస్యలున్నాయని, యూపీఎస్‌సీ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరైనా భూమి కేటాయించడం లేదన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. జీఓ59 ద్వారా డబ్బులు చెల్లించిన వారికి ఇంత వరకు రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదన్నారు. ఇటీవల జరిగిన దిశ సమావేశంలో పేర్కొన్న అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మల్కాజిగిరి నియోజకవర్గంకు చెందిన పలువురు నాయకులు, ప్రజలు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

కొడంగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హామీలను అమలు చేయాలని కోరారు. త్వరలోనే సీఎంను కలిసి ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతామని, ఆగస్టు 20న కొడంగల్‌లో ముదిరాజ్‌ల ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వేణుగోపాల్, నర్సింహులు, సత్యపాల్, తుడుం శ్రీనివాస్, వెంకటయ్య, బాలయ్య, నారాయణ, వెంకటయ్య, యాదగిరి, బాబయ్యనాయుడు, హనుమంతు, మైపాల్, తిరుపతయ్య, వెంకటయ్య, గోపాల్, రాములు, నారాయణ, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

» టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య

హైదరాబాద్ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఉత్తమసేవలందిచాలని దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్(సీఈ) పాండ్య అధికారులను ఆదేశించారు. బుధవారం బస్తీబాటలో భాగంగా జనరల్ మేనేజర్ అంజయ్య, సైబర్‌సిటీ ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ శ్యాంకుమార్‌లతో కలసి కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రకాలనీ, గోల్డెన్ తులిపి, కొండాపూర్ ప్రాంతాల్లో పర్యటించారు. సీఈ మాట్లాడుతూ స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా బస్తీబాట కార్యక్రమంలో తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కాలనీఅసోషియేషన్లు, అపార్ట్‌మెంట్ల వాసులతో సిబ్బంది తరుచూ అందుబాటులో ఉంటారన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత ముఖ్యం

» రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

» లక్షణాలుంటే వెంటనే వైద్యం చేయించుకోవాలి

చేవెళ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున కొన్ని నెలపాటు ప్రజలు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వానకాలంలో వ్యాధులు సోకే ఆస్కారం ఎక్కువని అంటున్నారు. ఆ తర్వాత వచ్చే చలికాలంలోనూ అప్రమత్తత అవసరమని డాక్టర్లు సూచిస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి ఆవరణ, రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా పంచాయతీలు, మునిసిపాలిటీలు చర్యలు చేపట్టాలి. మురుగు కాలవల్లో పేరుకునే పూడికను ఎప్పటికప్పుడు తీసేయించాలి. దోమలు వృద్ధి చెందకుండా చర్యలుచేపట్టాలి. దోమ కాటుతో పలు రకాల వ్యాధులొస్తాయి. దోమలు ఎక్కువ కుడితే ఫ్లూ, మలేరియా వ్యాధులొస్తాయి. జ్వరం, కండరాలు నొప్పులు, వాంతులు దద్దుర్లు వంటివి ఈ వ్యాధి లక్షణాలు. రక్తంలో ప్లేట్లెట్లు ఒక్కసారిగా పడిపోయి ప్రాణానికి ముప్పు వాటిల్లే ఆస్కారం ఉంటుంది. సాధారణ ఫ్లూ పట్ల ప్రజలు జాగ్రత్త పడాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఫ్లూ త్వరగా సోకుతుంది. జలుబు, దగ్గు, ఆయాసం, శక్తి కోల్పోవడం వంటి లక్షణాలు ప్రధానంగా కన్పిస్తాయి.

స్వైన్ ఫ్లూతో జాగ్రత్త

అక్టోబరు నుంచి మార్చి వరకు స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. ఈ వైరస్ ప్రధానంగా శ్వాసకోశ వ్యవస్థపై దాడిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకుతుంది. స్వైన్‌ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైరస్ లక్షణాలుంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇలా చేయాలి...

- నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. లార్వా దశలోనే దోమల వృద్ధిని అరికట్టాలి.
- మురుగు కాల్వ పూడిక, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కాల్వల్లో మందు పిచికారీ చేపట్టాలి
- ప్రధాన ఆవాస ప్రాంతాలు, అంతర్గత కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
- వ్యాధులు ప్రబలే మురికివాడల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.



చేవెళ్లలోని భగత్‌సింగ్ కాలనీ రోడ్డుపై నిలిచిన నీరు

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి



వానకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జలుబు, జ్వరం వంటి లక్షణాలున్న వారు వెంటనే వైద్యం చేయించుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే సగం వ్యాధులను అరికట్టొచ్చు. అనారోగ్యానికి, వైరల్ వ్యాధులకు సంబంధించి ఏ చిన్న లక్షణాలు కన్పించినా వైద్యం చేయించుకోవాలి. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వ్యాదులకు వైద్యం అందుబాటులో ఉంది.

\- డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చాలి

» ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చాల్సిన బాధ్యత అధికారులదేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు, రూరల్ మండలానికి చెందిన 1,294 మందికి కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి గత పాలకులు జేబులు నింపుకున్నారని విమర్శించారు. తాము పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసాతో అమలుతో ఓర్వలేక ప్రతిపక్షాలు సోయితప్పి మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. విపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదన్నారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగు నీరు వంటి వసతులు కల్పించేందుకు దశలవారీగా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, యంత్రాంగం కూడా ఎప్పటికప్పుడు తగు రీతిలో స్పందిస్తోందన్నారు. పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారుల నుంచి పైస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మధుసూదన్‌రెడ్డి, కె.గురునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్లు బి.సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మంకాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై అధికారుల సీరియస్

» పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుకు ఎంపీడీవో ఆదేశం



కార్యదర్శిని వివరాలు అడుగుతున్న ఎంపీడీవో

బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మైల్వార్‌లోని బృహత్ పల్లె ప్రకృతి వనం భూమి తమందంటూ కొందరు చెట్లు నరికివేయడంపై బషీరాబాద్ ఎంపీడీవో తిరుమలస్వామి బుధవారం స్పందించారు. సదరు వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలని పంచాయతీ కార్యదర్శి నర్సింహాగౌడ్‌ను ఆదేశించారు. మైల్వార్‌లో పదెకరాల్లోని బృహత్ ప్రకృతి వనం భూమి తమదని మెతుకు బసమ్మ చెట్లను నరికివేయించారు. ఆ భూమి రెవెన్యూ రికార్డులు సేకరించిన కార్యదర్శి వాటిని ఎంపీడీవో, ఎంపీవోలకు చూపించారు. సదరు పదెకరాలను రెవెన్యూ అధికారులు ప్రకృతి వనానికి అప్పగించిన డ్యాకుమెంట్లను అధికారులు పరిశీలించారు. అధికారులు, కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఈ నెల 28నే పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఆ భూమి పత్రాలు తేవాలని ఎస్‌ఐ సూచించారని కార్యదర్శి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం కార్యదర్శి మరోసారి ఫిర్యాదు చేశారు.



పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న మానిటరింగ్ కమిటీ

అభివృద్ధి పనుల పరిశీలన

కొడంగల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బుధవారం జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులు పర్యటించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, మొక్కల పెంపకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రోడ్ల వంటి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులతో తీసుకున్న రుణాలను ఏవిధంగా చెల్లిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పెన్షన్‌దారుతో మాట్లాడి జీవనోపాధికి డబ్బులు ఏవిధంగా ఖర్చు చేస్తున్నారో తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు జోసెఫ్, వినోద్, ఏపీడీ సరళ, ఎంపీడీవో ఉషశ్రీ, ఎంపీవో జైపాల్ రెడ్డి, ఏపీవో రాములు, పీఆర్ ఏఈ రవికిరణ్ రెడ్డి, పంచామతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ప్రజాసేవకు యువత రాజకీయాల్లోకి రావాలి

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వేదికగా యువత ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల్లో యువతకు కాంగ్రెస్ అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ యువతకు రాజకీయ అవకాశాలు కల్పిస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. విపక్షాల కుట్రలను, విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 19నెలల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, కిషన్‌రెడ్డి, బీచ్యనాయక్, మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణనాయక్, వెంకటేశ్, వెంకటరమణారెడ్డి, ఫరీద్, శ్రీకాంత్, శ్రీశైలం, హీరాసింగ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్

సమస్యలపై నిర్మాణాత్మక పోరాటాలు చేయాలి

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత సమస్యలపై నిర్మాణాత్మక పోరాటాలను చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్ చెప్పారు. బుధవారం తాండూరులో పట్టణ, మండల మహా సభల్లో ఆమె ప్రసంగించారు. రాజకీయాల దృష్ట్యా మనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రజల పక్షాన నిలబడే బాధ్యత మనకుందని వివరించారు. వికారాబాద్ ప్రాంత సమస్యలను సీపీఐ ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తారని గుర్తుచేశారు. ప్రజా సంఘాల నిర్మాణం సరిగ్గా ఉంటే పార్టీ బలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్, పార్టీ మండల కార్యదర్శి దస్తప్ప, పట్టణ కార్యదర్శి మునీర్, లక్ష్మణ్, దస్తప్ప, విజయ్, రాజేందర్, దశరథ్‌గౌడ్, మినాజుద్దీన్, అశోక్, విజయలక్ష్మి, దేవి, జగదాంబ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఏర్పాటు

తాండూరు పట్టణ నూతన కార్యదర్శిగా మునీర్ అహ్మద్, సభ్యులుగా ఇమ్రాన్, నసీమా బేగం, జగదాంబ, విజయ్, రాజేందర్, మండల కార్యదర్శిగా యాదప్ప, సహాయ కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులు దస్తప్ప, లక్ష్మణ్, చంద్రమ్మ, శివ, గోపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పాలనతో గ్రామాల్లో ప్రగతి కాంతులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రగతి కాంతులు, పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తమకు సామాజిక న్యాయం జరుగుతోందన్నా సంతోషం ప్రజల్లో వ్యక్తమవుతుందని చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమనగల్లులో జాతీయ రహదారి రాజీవ్ చౌక్ నుంచి సందబావి వరకు రూ.5కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కడ్తాల మండల పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. శెట్టిపల్లిలో ఇటీవల చనిపోయిన కొమ్ము లక్ష్మమ్మ సంతాప కార్యక్రమంలో పాల్గొని ఆమె కుటుంబానికి రూ.5వేల సాయం అందజేశారు. మాడ్గుల మండలానికి మంజూరైన 670 రేషన్ కార్డులను, 10 కల్యాణలక్ష్మి చెక్కులను ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, తహసీల్దార్ వినయ్ సాగర్‌లతో కలిసి అందజేశారు. ఆయా చోట్ల జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. ఇందుకు అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, విస్తరణకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కసిరెడ్డి తెలిపారు. ప్రధాన రూట్లలో రద్దీకి అనుగుణంగా కొత్త బస్సు సర్వీసులను వేస్తున్నట్టు చెప్పారు. పదేళ్ల తర్వాత పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు లక్పతినాయక్, ఎగిరిశెట్టి సత్యం, సూదిని కొండల్‌రెడ్డి, జంగయ్య, యాదయ్యగౌడ్, ఇటిక్యాల విజయమ్మ, వెంకట్‌రెడ్డి, జగన్, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాబా, తాళ్ల రవీందర్, బొజ్జ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి అన్నారు. ఆవురుపల్లిలోని నల్లవారిపల్లి రోడ్డులో ఉన్న కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయంలో పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ చైర్మన్ బాలమోని రవికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు నర్సింహాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, జీవీ.గౌడ్, నిరంజన్‌గౌడ్, వెంకటయ్య గౌడ్, కృష్ణయ్యగౌడ్, చిన్న నర్సింహాగౌడ్, శ్రీశైలంగౌడ్ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులను లంచం అడిగితే ఇంటికే..

మాడ్గుల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎవరైనా డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటామని, డబ్బు డిమాండ్ చేస్తే వారిని డిస్మిస్ చేస్తామని ఎమ్మెల్యే నారాయణరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తగా 670 రేషన్‌కార్డులు, పాత కార్డుల్లో 2,300 మంది కుటుంబీకుల పేర్లను కొత్తగా చేర్చినట్టు తెలిపారు. కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు లబ్ధిదారుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'మీకు ఇల్లు మంజూరైంది. మాకు ఏమీ లేదా?' అని కొందరు లబ్ధిదారులను డబ్బు అడుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఉద్యోగులు పేదలను డబ్బు డిమాండ్ చేయడం ఏమిటని ఎమ్మెల్యే.. ఇన్‌చార్జి ఎంపీడీవో వేజన్నను నిలదీశారు. ఎవరైనా లంచం తీసుకుంటే ఉద్యోగం ఊడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినయ్‌సాగర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్ రెడ్డి, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, పాండుగౌడ్, మాజీ ఎంపీపీ జంగయ్య, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

పక్కాగా విద్యార్థుల హాజరు



(ఐదో పేజీ తరువాయి)

ముఖ గుర్తింపు హాజరు విధానం అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా తక్కువగా హాజరు నమోదయ్యే పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. యూడైస్, ముఖ గుర్తింపు హాజరు ఆధారంగానే మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్నారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం ఎప్పటికప్పుడు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో తెలిసిపోతుంది. ఏ ఏ పాఠశాలలో విద్యార్థుల హాజరు తీరు ఏ విధంగా ఉందో తెలుసుకుని తక్కువ హాజరు శాతం నమోదైన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు నేరుగా ఫోన్ చేసి విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రాలేదో తెలుసుకుంటున్నారు.

మూడుచింతలపల్లిలో 68.66 శాతం..

మేడ్చల్ జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలుండగా 375 ప్రాథమిక, 22 ప్రాథమికోన్నత, 108 ఉన్నత పాఠశాలలున్నాయి. అందులో దాదాపు 90 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో జిల్లాలో అత్యధికంగా మూడుచింతలపల్లిలో 68.66 శాతం ముఖ గుర్తింపు ద్వారా హాజరు శాతాన్ని నమోదు చేస్తున్నారు. అత్యల్పంగా కాప్రాలో 42.06 శాతం హాజరు శాతాన్ని నమోదు చేస్తున్నారు. వంద శాతం ముఖ గుర్తింపు హాజరు నమోదుకు విద్యాశాఖాధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

కొలిక్కి వచ్చేనా?

(ఐదో పేజీ తరువాయి)

మరికొందరు ఉపాధ్యాయులకు భారంగా మారే అవకాశం ఉన్నట్లు సమాచారం. సర్దుబాటు కింద తమను ఇతర పాఠశాలలకు పంపించే అవకాశం ఉందని తెలుసుకున్న కొందరు ఉపాధ్యాయులు తాము కొనసాగుతున్న పాఠశాల చోటు నుంచి వేరే పాఠశాలలకు మార్చవద్దంటూ విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు సర్దుబాటు కోసం కొందరు ప్రజా ప్రతినిధుల నుంచి కూడా ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో జిల్లాలో సర్దుబాటుపై ఏ మేరకు నిర్ణయం తీసుకుంటారనేది ప్రశ్నార్థంగా మారింది.

ప్రతిపాదనలు పరిశీలించిన తర్వాతే..

ఇదిలా ఉంటే, వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద పనిచేస్తున్న పాఠశాలల నుంచి ఇతర పాఠశాలలకు ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు ఉద్దేశించిన సర్దుబాటు ప్రక్రియ ఎలాంటి గందరగోళ పరిస్థితులకు చోటు కల్పించకుండా అంతా సజావుగా చేపట్టాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తలెత్తకుండా... ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా.. సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ వ్యవహారంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సర్దుబాటు విషయం ఓ కొలిక్కి వచ్చినా ఇంకా స్కూల్ అసిస్టెంట్లపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ఉన్నతాధికారులు సర్దుబాటు ప్రక్రియను త్వరగా ముగించాలని ఆదేశాలు ఉన్నా ఇంకా సాగదీస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు జిల్లా కలెక్టర్ నేతృత్వం వహిస్తుండగా, మండల విద్యాధికారుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత కూడా సర్దుబాటుపై జిల్లా విద్యా శాఖ అధికారులు ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

క్రైం కార్నర్

పాముకాటుకు మహిళ మృతి



వైష్ణవి(ఫైల్)

దుద్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన దుద్యాల మండలంలో జరిగింది. కుదురుమళ్ల గ్రామానికి చెందిన కొండగళ్ల వైష్ణవి(24) మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత కాలకృత్యాల కోసం ఇంట్లో నుంచి బయటకు వెళ్తుండగా నాగుపాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు నారాయణపేట జిల్లా కోస్గి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందింది. మృతురాలికి 7 నెలల బాబు ఉన్నాడు. వైష్ణవి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డీసీఎం ఢీకొని యువకుడి మృతి

పరిగి, జూలై 30(ఆంధ్రజ్యోతి): బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట జరిగింది. నవాబ్‌పేట్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరిగూడ శ్రీనివాస్(36) బైక్‌పై వెళ్తుండగా ప్రభుత్వాసుపత్రి వద్ద వెనకాల నుంచి వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ ఉన్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మేడ్చల్ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి) మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రింగ్‌రోడ్డు జంక్షన్ సమీపంలో గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచాచం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. అతడి వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాలిక ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): అనార్యోగం కారణంగా ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడకు చెందిన బత్తిని అంజయ్య, సుజాత దంపతుల కూతురు నాగమణి(19) ఆరేళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు చిన్నప్పుడే గుండెలో చిన్న రంధ్రం ఉండటం వల్ల మానసికంగా ఇబ్బంది పడుతోంది. నెల క్రితం వైద్య పరీక్షలు సైతం చేయించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు బాలికను కిందికి దించి నారపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కీసర సీఐగా ఆంజనేయులు



కీసర రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా అర్కపల్లి ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భువనగిరి స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ ఆంజనేయులు కీసర ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై విచ్చిన విషయం తెలిసిందే. కాగా కీసర ఇన్‌స్పెక్టర్‌గా ఇప్పటివరకు విధులు నిర్వహించిన శ్రీనివాస్ ఎస్‌వోటీ-1 విభాగానికి బదిలీపై వెళ్లారు.

స్పెషల్ బ్రాంచ్‌కు సీఐ పరశురాం



ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన పందిరి పరశురాం రాచకొండ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో తొమ్మిది నెలల 20 రోజులు సీఐగా విధులు నిర్వర్తించారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహిచిన బాలస్వామి ఘట్‌కేసర్ సీఐగా బదిలీపై వచ్చారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రజలకు, సిబ్బందికి దన్యవాదాలు తెలిపారు.

త్వరలో మెడికల్ కాలేజీకి అనుమతులు

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కోడంగల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు దరఖాస్తు చేశామని, ఇంకా అనుమతులు రాలేదని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ నరేంద్ర అన్నారు. తాండూరులో మెడికల్ కాలేజీ ఏర్పాట్లను ప్రిన్సిపల్ సెక్రటరీతో కలిసి పరిశీలించారు. త్వరలో కొడంగల్‌కు మెడికల్ కాలేజీకి అనుమతులు వచ్చే అవకాశం ఉందని, ముందుగా 50 మంది విద్యార్థుల సామర్థ్యంతో తాండూరు నర్సింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చౌడాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలోని వాల్యానాయక్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ గోబ్రియా నాయక్ కుమారుడు సంతోష్‌నాయక్ మంగళవారం శంకర్‌పల్లిలో భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, సంతోష్‌నాయక్ బుధవారం తండాలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాందాస్‌నాయక్ ఉన్నారు.

టై, బెల్టులు అందజేత

ధారూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం బెల్టులు, టైలు, బ్యాడ్జీలు అందజేశారు. దాత బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి బుధవారం పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, నాయకులు వెంకట్రామ్ రెడ్డి, యాదయ్య, శ్యామయ్య పాల్గొన్నారు.

ఎంఐఎం మండలాధ్యక్షుడిగా మోహిజ్ ఖురేషీ

ధారూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం మండలాధ్యక్షుడిగా మహ్మద్ మోహిజ్ ఖురేషీ ఎన్నికయ్యారు. బుధవారం ధారూరులో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి సమద్ బిన్ అబ్దాద్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ సల్మాన్, కోశాధికారిగా ఎండీ సబీల్, సంయుక్త కార్యదర్శులుగా ముస్తాపా, అల్తాఫ్ అలీ, ఇస్మాయిల్, ఇలీయాస్, సలావుద్దీన్, నబీ, సభ్యులుగా ఉస్మాన్, అరీఫ్, నవాజ్, ముజాయిద్, పయాజ్, అహ్మద్, ఖాసీం, అమానుల్లా, తదితరులను ఎన్నుకున్నారు.

మన్నెగూడలో ఉద్యాన పంటల మార్కెట్

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మన్నెగూడ పరిసరాల్లో ఉద్యానపంటల మార్కెట్ ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆత్మ పాలకవర్గ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో ఏటా ఉద్యానపంటల సాగు పెరుగుతుందని, అందుకనుగుణంగా పూడూరు మండల పరిధిలో మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిగిలో రూ.25 లక్షలతో ఆత్మ కార్యాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, డీఏవో రాజరత్నం, జిల్లా ఉద్యానశాఖ అధికారి సత్తార్, ఏడీఏ లక్ష్మీకుమారి, పశువైద్య శాఖ ఏడీ అంకం రాజు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



పరిగి: మాట్లాడుతున్న కమిషనర్ వెంకటయ్య

పరిగి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. బుధవారం మునిసిపల్ పరిధిలోని ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. వంటశాలలో ఆహారపదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆహారం, ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపొద్దని సూచించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాలిని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథం ఉన్నారు.

మోమిన్‌పేట్‌లో ప్రత్యేకాధికారి తనిఖీ

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధికారి సదానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మరు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మర్పల్లి: మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

మర్పల్లి/బంట్వారం, జూలై30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్పల్లి మండలంలోని పట్లూర్ గ్రామంలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్, నాయకులు శివరాజ్, యాదవరెడ్డి, బాల్‌రాంగౌడ్, శ్రీమంత్‌కుమార్, నాగన్న, అన్నపూర్ణ, మహేశ్వరి, జైపాల్, మహేశ్, శివ, మధు, సంగమేశ్వర్, అమర్‌నాథ్, గోవర్ధన్‌రెడ్డి, నరేశ్, గణేశ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బంట్వారానికి రోడ్లు వేయాలి

బంట్వారం మండల పరిధిలోని గ్రామాల నుంచి మండల కేంద్రానికి రోడ్లు వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదనంద్ రెడ్డి, నవీన్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మహేష్‌యాదవ్, కంతి మల్లేశం, చాకలి రాజు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆత్మ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

పూడూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) కమిటీ పరిగి నియోజకవర్గ చైర్మన్‌గా పూడూరు మండలం మంచన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కక్కులూరి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సమక్షంలో క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. రైతు సంక్షేమానికి ఆత్మ కమిటీలు దోహదపడుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కులకచర్ల: మండలంలోని అంతారం గ్రామానికి చెందిన బోయిని ప్రభాకర్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ప్రభాకర్ మండలంలోని పుట్టపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివాడు. తోటి స్నేహితులు బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25వేలు ఆర్థికసాయం అందించారు.

పెద్ద చెరువు కాల్వకు మరమ్మతులు

కొడంగల్: కొడంగల్ పెద్ద చెరువు పాటు కాల్వ మరమ్మతు పనులను బుధవారం అధికారులు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ పర్యవేక్షణలో కాల్వలో పేరుకుపోయిన చెత్తచెదారం, మట్టిని జేసీబీ సాయం తో తొలగించారు. సిబ్బంది నవీన్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

పెద్దేముల్: యువత మత్తుకు బానిస కావొద్దని ఎస్ఐ వేణుకుమార్ అన్నారు. పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మానవ అక్రమ రవాణా, మాదక ద్రావ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, వాడుతున్నా సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ

వికారాబాద్: పొగాకు నిర్మూళనపై వికారాబాద్ పట్టణంలో భృంగీ పాఠశాల విద్యార్థులు పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి ఉన్నారు.



దౌల్తాబాద్: లబ్దిదారులకు ప్రొసీడింగ్‌లు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

దౌల్తాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వీరన్న, మాజీ ఎంపీటీసీ మంజుల, దస్తప్ప అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో పలువురు లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్‌గౌడ్, ఎల్లప్ప, సాయిలు, అంజిగౌడ్, ఎండీ రఫీ పాల్గొన్నారు. అలాగే దౌల్తాబాద్ మండలంలోని చల్లాపూర్ గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగేందర్, నాయకులు విజయ్‌కుమార్, వెంకటమ్మ, పకీరప్ప, శరణయ్య, కిష్టమ్మ, బాల్‌రాజ్, మల్లేశ్, రాజప్ప, చంద్రశేఖర్, శివకుమార్, డీలర్ వెంకటప్ప, పెద్ద రాములు, నాగప్ప, రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఘట్‌కేసర్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తుందని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఘట్‌కేసర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల సొంతింటి కళ నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్, ఆంజనేయులు, ఫారూక్, సిరాజ్, రహమాన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

పరిగి, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చిట్యాల్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం పరిగిలోని జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య, జిల్లా మలేరియా అధికారి వెంకన్న, వార్డెన్ రాజేశ్వర్, ఏటీపీ ప్రవళిక, వైద్యశాఖ సూపర్‌వైజర్లు రాములు, రాఘవేందర్, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రంగనాయకస్వామికి చక్రతీర్థం



స్వామివారికి చక్రతీర్థ స్నానం చేయిస్తున్న వేద పండితులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌లోని శ్రీ గోదా సమేత మన్నారు రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి చక్రతీర్థ స్నానం చేయించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

కీసర రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలోని శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం గణపతి పూజ, అభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అన్నంరాజ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ పాదయాత్ర

(ఐదో పేజీ తరువాయి)

కొనసాగనుంది. అనంతరం పాదయాత్రను ఉద్దేశించి మీనాక్షీ నటరాజన్, మహేశ్ కుమార్‌గౌడ్ తదితరులు ప్రసంగించనున్నారు. అనంతరం పరిగి మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి నివాసంలో వారు రాత్రి భోజనం ముగించుకుని అక్కడే బస చేయనున్నారు. ఆగస్టు ఒకటో తేదీ, శుక్రవారం ఉదయం 8 గంటలకు పరిగిలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో నిర్వహించే శ్రమదాన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటనున్నారు. అనంతరం 10 గంటలకు పరిగి పట్టణంలోని ఎస్ గార్డెన్స్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

ఏర్పాట్లు పూర్తి

కాగా, 'ప్రజల వద్దకు కాంగ్రెస్' పాదయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం ఆ కార్యక్రమ కో-ఆర్డినేటర్లు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పులి అనిల్, ధనలక్ష్మి, వెంకటేశ్‌లతో పాటు, పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రంగాపూర్ గేట్ దగ్గర పాదయాత్ర ప్రారంభించే స్థలాన్ని, శ్రమదానం చేసే గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. పాదయాత్ర ప్రారంభించే రంగాపూర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించేందుకు దిమ్మెను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు గురువారం జరగనున్న 'ప్రజల వద్దకు కాంగ్రెస్' కార్యక్రమానికి పరిగి నియోజవవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఎరంపల్లి కమిటీతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

త్వరలో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

కులకచర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో మండలంలోని అన్నీ గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎన్నుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని పీరంపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమయ్య ఎన్నికయ్యారు. కార్యకర్తల నిర్ణయం మేరకు గ్రామ కమిటీలను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌రెడ్డి, రాంచంద్రయ్య, నాయకులు సత్యనారాయణ, నర్సింహులు, రమేశ్ పాల్గొన్నారు.

బీజేవైఎం మండలాధ్యక్షుడిగా నవీన్ జోషి



పూడూరు, జూలై 30, (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నవీన్ జోషి నియమితులయ్యారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు తుంపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో నియామకం జరిగింది. యువ మోర్చ మండల అధ్యక్షుడిగా పూడూరుకు చెందిన పూజారి నర్సింహాచారి, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడిగా గొరెంక రవీందర్, దళిత మోర్చ అధ్యక్షుడిగా కంకల్‌కు చెందిన చించెట్టి రాంచంద్రయ్య, మహిళా మోర్చ అధ్యక్షురాలిగా గొంకుపల్లికి చెందిన మున్నూరు విద్య, ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా కుర్వ మల్లేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, స్థానికులు నవీన్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు.

నవ వధువుకు పెళ్లి కానుక అందజేత

మోమిన్‌పేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కుంద గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్య కూతురు శ్రీవాణికి బుధవారం పెళ్లి కానుకగా మాజీ సర్పంచ్ కరణం పార్వతమ్మ కుమారుడు రాష్ట్ర నాయకుడు కరణం రామకృష్ణ రూ.25,501 అందించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఐదేళ్లుగా గ్రామంలో ప్రతి ఆడబిడ్డ పెళ్లికి పెళ్లి కానుక అందిస్తున్నానని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం దోమ మండలంలోని ఖమ్మం నాచారం గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ కార్డు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, మార్కెట్ కిమిటీ డైరెక్టర్ దొరశెట్టి శాంతికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి



మోమిన్‌పేట్: మక్తతండాలో మాట్లాడుతున్న ఏఎస్ఐ వెంకటయ్య



తాండూరు రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ వినోద్

మోమిన్‌పేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కులపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఏఎస్ఐ వెంకటయ్య, ఆర్ఐ గోవర్ధన్ అన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని మక్తతండాలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులకు పౌరహక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మాధవి, అంగన్‌వాడీ టీచర్ తారా బాయి, మాజీ సర్పంచ్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కరన్‌కోట్ ఎస్ఐ వినోద్ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక హక్కులు, పౌర హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

బంట్వారం: పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ రాములు, ఎస్ఐ విమల అన్నారు. మండల పరిధిలోని మాలసోమారం గ్రామంలో బుధవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంగోపాల్, పోలీసు సిబ్బంది రాంచందర్, కృష్ణ ఉన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

మేడ్చల్ టౌన్: సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించాలని మేడ్చల్ తహసీల్దార్ భూపాల్ అన్నారు. బుధవారం ఎల్లంపేట మున్సిపాలిటీ డబీల్‌పూర్‌లో నిర్వహించిన పౌర హక్కుల సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మర్రి రాజిరెడ్డి మృతి తీరని లోటు



రాజిరెడ్డి అంత్యక్రియల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మర్రి రాజిరెడ్డి మృతి తీరని లోటని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మర్పల్లి మండలంలోని సిరిపూరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మర్రి రాజిరెడ్డి మృతి చెందాడు. బుధవారం ఆయన అంత్యక్రియల్లో స్పీకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ విపత్తుల మాజీ ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి, నాయకులు సురేశ్, లక్ష్మారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.